క్లుప్తంగా

బీసీ ఉద్యోగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామాంజనేయులు



నియామకపత్రాన్ని అందుకుంటున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీ ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయం ఈఓ కురుమ రామాంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని సూచించారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని రామాంజనేయులు పేర్కొన్నారు. చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో బిల్లుపెట్టి ఆమోదింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేవి ఆటలు

చిక్కడపల్లి: మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని ఆటలు పెంపొందిస్తాయని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇటీవల మహిళలకు నిర్వహించిన ఆటలపోటీల్లో విజేతలకు శనివారం అశోక్‌నగర్ క్రాస్ రోడ్స్‌లోని మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ హాల్‌లో బహుమతులను ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన 60 ఏళ్ల దేవినేని రజనిని ప్రత్యేకంగా అభినందించారు. పూర్ణ, శ్రీలత, స్వరూపారాణి, యశోద, జ్యోతి పాల్గొన్నారు.

మహిళలకు కేంద్రం అధిక ప్రాధాన్యం

బీజేపీ ఎంపీ డా. కె. లక్ష్మణ్

చిక్కడపల్లి: మహిళల ఆత్మగౌరవం పెంపొందించింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సత్కరించే కార్యక్రమం ముషీరాబాద్ బీజేపీ మహిళామోర్చా ఆధ్వర్యంలో శనివారం చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. మోదీ ప్రధాని అయ్యాక మహిళలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చారన్నారు.

- పట్టణాలు, గ్రామాల్లోని మహిళలకు మరుగుదొడ్లు, కనీస సౌకర్యాలు కల్పించామన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో బాలికలకు మౌలిక సదుపాయాలను కల్పించి టాయిలెట్స్‌ను నిర్మించామన్నారు.
- 'బేటి బాచావో బేటీ పడావో' నినాదంతో అమ్మాయిలు విద్యారంగంలో గొప్పగా రాణించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.
- కట్టెలతో వంట చేసే తల్లులందరికీ బాధలు తప్పించాలని ప్రధానమంత్రి ఉజ్వల పథకం కింద మహిళలకు గ్యాస్ కనెక్షన్‌లను ఇప్పిస్తున్నామన్నారు.
- మణిపూర్, సిక్కిం రాష్ట్రాల్లో పేద మహిళలకు రూ.20 లక్షల ఇళ్లు కట్టించారని, ఉత్తరప్రదేశ్‌లో 3,70,000,00 ల ఇళ్లను సీఎం యోగి కట్టించారన్నారు.
- మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని రూ. లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారని సీఎం కేసీఆర్‌పై ఆయన మండిపడ్డారు.
- రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని ప్రధాని దేశ ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుంటే తెలంగాణలో సీఎం కేసీఆర్ తన కుటుంబ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు.
- దేశ ప్రజలు మోదీ సంక్షేమ పథకాలు చూసి ఆయన చల్లగా బ్రతకాలని కోరుతుంటే తెలంగాణ ప్రభుత్వం ప్రధానిపై దుమ్మెత్తిపోస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముషీరాబాద్ మహిళామోర్చా కన్వీనర్ మాధవి, దిశ పార్లమెంట్ కమిటీ కన్వీనర్ మంగళ, సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ ఉపాధ్యక్షురాలు పద్మజారెడ్డి, రేవతి, తులసి, హైమ, సుజాత, మల్లీశ్వరి, కల్పనలను ఘనంగా సన్మానించారు.
- గాంధీనగర్, కవాడిగూడ, ముషీరాబాద్ కార్పొరేటర్లు ఎ.పావనివినయ్‌కుమార్, రచనశ్రీ, సుప్రియానవీన్‌గౌడ్, వినయ్‌కుమార్, రమేష్‌రామ్, బద్రినారాయణ, గోపాల్‌జీ, పూసరాజు తదితరులు పాల్గొన్నారు.



మహిళలు, కార్పొరేటర్లను సన్మానిస్తున్న బీజేపీ రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్

నిరుపేదలకు ఆయుష్మాన్ భారత్ వరం..

చిక్కడపల్లి: నిరుపేద కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ఆయుష్మాన్ భారత్ గొప్ప వరం లాంటిదని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. జవహర్‌నగర్‌లో శనివారం లబ్ధిదారుల నమోదు కార్యక్రమం జరగగా.. వారికి మంజూరైన ఈ-కార్డులను అందజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకం ఆయుష్మాన్ భారత్ అని పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి అర్హులని వివరించారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, ఉమేష్, సురేందర్, శివకుమార్, రఘుయాదవ్, స్థానికులు సునీత, భాగ్య, అక్కమ్మ, అంజమ్మ, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఈ - కార్డును అందజేస్తున్న కార్పొరేటర్ పావని

రాజయ్యపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలి

చిక్కడపల్లి: స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుస్తకాల కవిత డిమాండ్ చేశారు. జనగామ జిల్లా ధర్మసాగర్ మండలం జానకిపురం సర్పంచ్‌ను లైంగికంగా వేధించాడని ఆమె ఆరోపించారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాల మేరకు గాంధీభవన్ వద్ద రాజయ్య దిష్టి బొమ్మను దహనం చేశారు. రాజయ్యతో పాటు ఎమ్మెల్సీ కవిత, మహిళా లోకానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సుభాషిణి, సంగీత, రమాదేవి, జిలాని, భాగ్యలక్ష్మి, రోజి, స్వరూప, రాజోలి బేగం, రాణి, విజయ, ఉమ తదితరులున్నారు.

మహిళలను వంటింటికి పరిమితం కాకుండా ప్రోత్సహించాలి

కవాడిగూడ: మహిళలను చిన్న చూపు చూసి వంటింటికి మాత్రమే పరిమితం కాకుండా వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నగర మున్నూరుకాపు మహిళా అధ్యక్షురాలు కొత్త కృష్ణవేణి శ్రీనివాస్ అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆమె పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని తెగల బలిజ కాపు సంఘం కార్యాలయంలో మున్నూరు కాపు మహిళలను శాలువాలతో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జాయింట్ కలెక్టర్ టీఎస్‌పీఎస్‌సీ సభ్యురాలు అరుణాకుమారి, వుంజాల సుజాత, రజని, సుజాత, నాగమణి అన్నపూర్ణ, స్వరూపరాణి, శ్రీలత పలువురు మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. మంగమ్మ, సుధారాణి, అర్చన, పద్మజ, కవిత, లక్ష్మీప్రసన్న, వసంత, శ్వేత, అరుణ, కృష్ణప్రియ, కవిత, శ్రీలత, మౌనిక, నిర్మల, రామసుధ, శ్రీనివాస్‌పటేల్, బాల శ్రీనివాస్, వెంకట్‌కిషన్, సమీర్‌పటేల్, రాజుపటేల్, శ్రావణ్, సురేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న కొత్త కృష్ణవేణి

మార్నింగ్ వాకర్స్‌కు మరిన్ని సౌకర్యాలు



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: ఓయూకి ఆనుకుని ఉన్న డీడీ కాలనీ నివాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హామీ ఇచ్చారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే పర్యటించి వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేశారు. యూనివర్సిటీ డ్రైనేజీ నీరు జనావాసాల్లోకి వస్తోందని చెత్త, చెదారాలు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఆయన మోయిన్ చెరువును పరిశీలించి మార్నింగ్ వాకర్స్‌కు అనుగుణంగా పరిసరాలను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

తాగునీటి పైప్‌లైన్ పగిలి నీటి వృథా.. !

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి జల మండలి సెక్షన్ పరిధిలో ఆర్టీసీ కల్యాణ మండపం వద్ద వాటర్ పైపులైన్ పగిలి గత రెండు రోజులుగా తాగునీరు వృథా అవుతోంది. దీనిపై జలమండలి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వేసవి కాలంలో అచ్చయ్యనగర్, పాలమూరు బస్తీ, బాగ్‌లింగంపల్లి తదితర ప్రాంతాల్లో తాగునీరు సరిపోక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో నీటి వృథాపై సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి

ముషీరాబాద్: ముషీరాబాద్, భోలక్‌పూర్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం ఆసుపత్రి రికార్డులు, రిజిష్టర్‌లను పరిశీలించారు. గర్భిణీలు, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సమయపాలన తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రభుత్వాసుపత్రుల్లోనే డెలివరీ కేసులు అధికంగా నమోదయ్యేలా ఆశవర్కర్లు, వైద్యులు దీనికి కృషి చేయాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలను అందించాలని వివరించారు. ముషీరాబాద్, భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాస్, మౌనిక, భాగ్యలక్ష్మి, హేమలత తదితరులున్నారు.

లిక్కర్ కేసులో కవిత సీబీఐకి సహకరించాలి : ఆప్

ముషీరాబాద్: 'అవినీతికి వ్యతిరేకంగా పుట్టిన ఆమ్ ఆద్మీ పార్టీని కూడా నిలువెత్తు అవినీతిలో ముంచిన కవిత లిక్కర్ కేసును రాష్ట్ర ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు వెనుకేసుకుని వస్తున్నారని' తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ మండిపడ్డారు. '9 ఏళ్లుగా రాష్ట్రాన్ని లిక్కర్ మయం చేసి అధికారికంగా యేటా 40-50 వేల కోట్ల పాలసీలను స్వార్థ వ్యాపారం చేయడం ద్వారా అనధికారికంగా రూ. 20 వేల కోట్ల అక్రమార్జన చేస్తున్నారని' ఆరోపించారు. 'దేశంలోనే అతి భయంకరమైన అవినీతి రాష్ట్రంగా మలిచిన వీరిని నిజాయితీగా ఆరోపణలు ఎదుర్కొని విచారణకు సహకరించాలని' డిమాండ్ చేశారు.

దంత సంరక్షణే ఆరోగ్యానికి మేలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దంత సంరక్షణ ఎంతో ముఖ్యమని ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తోందని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని 'ది డెంటల్ హబ్' రెండో వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని లేని పక్షంలో వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. దంతాల పరిరక్షణ కోసం అప్పుడప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ది డెంటల్ హబ్ డైరెక్టర్ డాక్టర్ ఆసిఫ్‌ఖాన్, మాజీ మేయర్ లక్ష్మీనారాయణ, హౌజ్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ కిషన్‌రావు, జెన్‌కో మాజీ డైరెక్టర్ మోహన్‌రావు, రఫీ అహ్మద్, వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, వేణుగోపాల్, సంతోష్‌రెడ్డి, అజ్జూ, శ్రీను తదితరులున్నారు.

ప్రాణవాయు పార్క్ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రూ.15 కోట్లతో కుత్బుల్లాపూర్ గాజుల రామారం ప్రాణవాయు అర్బన్ పారెస్ట్ పార్క్ ఏడాది లోపే శిథిలావస్థకు చేరడం హాస్యాస్పదమని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాణవాయు పార్క్ నిర్మాణ లోపాలపై కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య శనివారం బాగ్‌లింగంపల్లిలో మాట్లాడారు. పార్కులోని జింకలు, పులుల ప్రతిమలు ఏడాదిలోపే శిథిలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు కాంట్రాక్టర్ నుంచి నిధులు రికవరీ చేసి పార్కును పారదర్శకంగా తిరిగి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ దీనిపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లికి చెందిన రైతు నారాయణరెడ్డి (64) ఉందానగర్ రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి

కాచిగూడ: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి ఉమెన్స్ కాలేజ్ సెక్రెటరీ ప్రొఫెసర్ సుదర్శన్ రెడ్డి అన్నారు. నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ)పై నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు విద్యార్థుల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెంచుకుని ఉంటారని వారి కలలను నెరవేర్చాలన్నారు. విద్యార్థులు చదువుకుని ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాస్తే విజయం తప్పక వరిస్తుందన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ అచ్యుతాదేవి, ఎంబీఏ డైరెక్టర్ ప్రొఫెసర్ రేణుకాసాగర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కవిత తదితరులున్నారు.



ముగింపు సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ సుదర్శన్‌రెడ్డి తదితరులు

క్రిస్టియన్, మైనార్టీలకు సన్మానం

నల్లకుంట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్లోబల్ గ్లోరియస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు మహిళలను వారిని ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఐజాక్‌రాజ్ గ్లోబల్ గ్లోరియస్ మినిస్ట్రీస్ చైర్మన్ న్యాయవాది గ్లోరీ ఆనందను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్లోబల్ గ్లోరియస్ మినిస్ట్రీస్ ప్రతినిధులు ఐజాక్‌రాజ్‌కు జ్ఞాపికను అందజేసి శాలువాతో సన్మానించారు. ఆర్చి బిషప్ ఫ్రెడ్రిక్ ఫ్రాన్సిస్ సతానియన్, కల్పన, రత్నకుమారి, సురేష్, డేవిడ్, ప్రేమకుమారి, సరితశ్రీ, రజిత, పార్వతి, విజయచౌదరి తదితరులున్నారు.

'బండి' వ్యాఖ్యలపై భగ్గుమన్న బీఆర్‌ఎస్

ముషీరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసనగా బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన చేపట్టాయి. శనివారం ముషీరాబాద్ చౌరస్తాలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. మహిళలు అంటే గౌరవం లేని బండి సంజయ్‌కి తెలంగాణ మహిళలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ముషీరాబాద్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శివముదిరాజ్, రాంనగర్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు ఆర్.మోజెస్, శ్రీనివాస్‌రెడ్డి, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ మైనార్టీ అధ్యక్షుడు మక్బుల్, ముషీరాబాద్ డివిజన్ మహిళా కమిటీ అధ్యక్షురాలు శోభ, నాయకులు రాజు, ప్రవీణ్, కళ్యాణ్ తదితరులున్నారు.

ముషీరాబాద్ సీఐకి ఎమ్మెల్యే ఫిర్యాదు..

- ఎమ్మెల్సీ కవితపై అనుచిత వాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సీఐ జహంగీర్‌యాదవ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 'ఈడీ, సీబీఐలు ప్రధాని మోదీ ఆదేశాల మేరకు పని చేస్తున్నాయని, ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తూ కవితపై అక్రమ కేసు బనాయించారని' ఆరోపించారు. మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు రహీం, శ్రీధర్‌చారి, ముచ్చుకుర్తి ప్రభాకర్, వీరేష్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ సీఐ జహంగీర్‌యాదవ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బీఆర్‌ఎస్ నేతలు

బండి సంజయ్ వ్యాఖ్యలు అర్థరహితం..

చిక్కడపల్లి: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని గాంధీనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి లక్ష్మి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అశోక్‌నగర్‌లో వారు మాట్లాడారు. ఓ మహిళ అని కూడా చూడకుండా కవితపై బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

క్షమాపణ చెప్పాలి..

కాచిగూడ: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. లింగంపల్లి చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. ఆయన క్షమాపణ చెప్పే వరకు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, అంబర్‌పేట్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, డాక్టర్ బద్దుల శిరీష, ఓంప్రకాష్‌యాదవ్, దిడ్డి రాంబాబు, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కృష్ణాగౌడ్, సునిల్ బిడ్లాన్, విజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ చౌరస్తాలో..

ముషీరాబాద్: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ వెంటనే క్షమాపణ చెప్పాలని రాంనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు రావులపాటి మోజేస్, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. రాంనగర్ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు గజ్జల సంపూర్ణ, మంజుల, లక్ష్మీబాయి, సరస్వతి, లలిత, నాగరాణి, మహేశ్వరి లక్ష్మి, జయశీల, సుగుణ, చంద్రకళ తదితరులున్నారు.

గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు..

కవాడిగూడ: పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. జంతర్‌మంతర్ వద్ద ఎమ్మెల్సీ కవిత దీక్ష చేసిన నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ.. కవాడిగూడ డివిజన్ బీఆర్‌ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు బంద్రు మాధవి ఆధ్వర్యంలో శనివారం గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. రూపా, సుశీల, మంజుల, మంగ తదితరులు పాల్గొన్నారు.